క్లుప్తంగా

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకాలు


సంపరలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మ వారికి పంచామృతాభిషేకాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అమ్మవారికి కంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర పారాయణ చేయించారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



ఏడీబీ రోడ్డులో ప్రమాదాల నివారణకు లైట్ ఏర్పాటు చేసిన పోలీసులు

రంగంపేట: ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ తోట కృష్ణ సాయి తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఏడీబీ రోడ్డులో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏడీబీ రోడ్డులోని కార్గిల్ ఫ్యాక్టరీ వద్ద చీకటిగా ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కారణంగా ఏడీబీ రోడ్డు అభివృద్ధి చేస్తున్న బీఎస్‌ఆర్ సంస్థ సహకారంతో శుక్రవారం లైటింగ్ ఏర్పాటు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

30న జాబ్ మేళా


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు, అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జేకేసీ, వికాస ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐసస్, ఎక్సాస్, టాటా, హ్యుందాయ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో తరలి రావాలని, ఉదయ 10 నుంచి సాయంత్రం 4 వరకూ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆవిష్కరించారు.

డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్ ప్రారంభం

పెదపూడి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 300 ఎంఏ డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్, మూడు కంప్యూటర్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ తాడి రామగురెడ్డి, తూర్పు డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, ఎన్డీఏ నేత సిరసపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సారా కేసులో మహిళ అరెస్ట్

రంగంపేట: సారా కేసులో ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్టీరాజాపురం శివారు వెంకన్నపేటలో ఒక మహిళను అరెస్ట్ చేసి, ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

నూరు శాతం అక్షరాస్యతకు 'ఉల్లాస్'

బిక్కవోలు: నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ ఎస్.జాన్ మిల్టన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చదవడం, రాయడం పాటు ఆర్థికపరంగా ఎదగడానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఎలా పొందాలనే విషయాలు తెలిపారు. అలాగే డిజిటల్ రంగాలపై అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 పూర్ణ చంద్రరావు, వెలుగు ఏపీఎం సుప్రియ, ట్రైనర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


స్వస్తిక్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


ఓటు వేయడానికి క్యూలో ఉన్న మహిళలు (ఫైల్)

చైతన్యం ఓటెత్తాలని..

- ఓటు హక్కు ఎంతో విలువైంది
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

బిక్కవోలు: ఓటు.. ఇది సామాన్యుని చేతిలో వజ్రాయుధం. నేతల తలరాతలు మార్చే అద్భుత సాధనం.. ఉత్తమ పాలకులను ఎన్నుకునేందుకు, భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఇదో అస్త్రం. ప్రజాస్వామ్యం, ఎన్నికలపై యువతీ, యువకుల్లో ఆసక్తిని పెంచేందుకు, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొంది, ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. కుల, మత, వర్గ, వర్ణ వివక్ష లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల కమీషన్ అవకాశం ఇచ్చింది. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అనపర్తి నియోజకవర్గంలో మొత్తం 2,23,649 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అనపర్తి మండలంలో 59,123 మంది, బిక్కవోలు మండలంలో 57,788, రంగంపేట మండలంలో 47,438 మంది, పెదపూడి మండలంలోని 59,300 మంది ఓటర్లుగా నమోదయ్యారు. శనివారం ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై పలువురి అభిప్రాయాలు ఇలా..

బాధ్యత వారిదే..



దేశ భవిష్యత్తును నిర్దేశించేది ఓటర్లే. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుతో మంచి పాలనను తీసుకొచ్చే బాధ్యత వారిదే. ఓటెయ్యపోతే ఏం కాదులే అనే భావనను వీడి, అంతా ఉత్తమ ప్రజాస్వామ్య నిర్మాణంలో భాగస్వాములు కావాలి.
–బీఎస్‌వీవీ కృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

కుళ్లును పారదోలాలి



ప్రతి పౌరుడు తన ఓటుతో దేశ అభ్యున్నతికి పాటుపడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోరాదు. దేశం పట్ల తన నిబద్ధతను నిజాయితీగా ఓటు వేయడం ద్వారా నిరూపించుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం కుళ్లును పారదోలగలం.
–వి.శ్రీనివాస్, ఎంపీడీఓ, బిక్కవోలు

అక్షరాస్యత ముఖ్యం



నూరు శాతం అక్షరాస్యత సాధ్యమైతే సమాజంలో ఓటు హక్కు వినియోగం సక్రమంగా జరుగుతుంది. ఓటు హక్కుపై నిరక్షరాస్యులకు అవగాహన తరగతులు నిర్వహించాలి. ఓటింగ్ పట్ల, ఓటు నమోదుపై మరింత అవగాహన పెరగాలి.
–ఎస్.జాన్‌మిల్టన్, ఈఓపీఆర్డీ, బిక్కవోలు

ఓటు విలువ తెలుసుకోవాలి



పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలి. ఓటు విలువ, దాని ప్రాధాన్యం తెలుసుకోవాలి. ఓటర్లను డబ్బుతో కొనటం అనే ధోరణి సమాజంలో తొలగిపోవాలి.
–వాసంశెట్టి రవిచంద్రకుమార్, ఎస్సై, బిక్కవోలు

సమకాలీన పరిస్థితులు తెలియాలి



ఓటరుకు సమకాలీన స్థితిగతులపై అవగాహన కల్పించేలా ఓ పటిష్ట యంత్రాంగం అవసరం. ఎవరైతే సుపరిపాలన అందించగలరనే అంశంలో బేరీజు వేసుకోగల శక్తి ఉండాలి. అప్పుడే ఉత్తమ పాలకులను ఎన్నుకోగలరు.
–విజయలక్ష్మి, వైద్యురాలు, కొంకుదురు పీహెచ్‌సీ

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు


తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

సీతానగరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. చిత్రలేఖనం పోటీలో 9వ తరగతి విద్యార్థులు ఎం.లక్ష్మీ ప్రసన్న, ఎస్.జాన్ వెస్లీ, జి.కనక వేసిన చిత్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. వీరికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.సుందర్రావు, యు.రామకృష్ణ, ఎస్.వీరబాబు, టి.మాచారమ్మ పాల్గొన్నారు.

గ్రామ సభలు వేగంగా పూర్తి చేయండి


కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ పీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 28వ తేదీలోపు గ్రామ సభలు నిర్వహించి, జీపీడీపీకి సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఈఓ పీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను వెంటనే వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. గ్రామాల్లో స్వామిత్వ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీలు సంబంధించి పంచాయతీలకు డిజిటలైజేషన్ త్వరితగతిన నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పన్నులు, పన్నేతరాలు అన్ని ఈ నెలాఖారులోపు నూరు శాతం వసూలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎల్‌ఈడీ పేమెంట్లు, సీసీ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. పీఆర్ యాప్‌ను ప్రతి రోజు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అన్ని సర్వేలు వేగంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, నాగేంద్ర, సుంకర వీరా స్వామినాయుడు, తరుణ్, ఉష తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన


సంపరలో జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కేంద్ర సిబ్బంది


కోరుకొండలో ర్యాలీ చేస్తున్న అంగన్ వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు


రాజానగరం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ప్రముఖులు


చినకొండేపూడి హైస్కూల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెద్దలక్ష్మి

పెదపూడి: సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ ఆర్‌ఎన్‌వీ ప్రసాద్ అన్నారు. సంపర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఒకప్పుడు ఆడపిల్ల అంటే టెన్షన్‌గా భావించే వారని, నేడు ఆడపిల్ల అంటే పది మంది కొడుకులతో సమానమని నిరూపిస్తున్నారని అన్నారు. నేటితరం బాలుకలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. 2008 నుంచి ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. హెచ్‌ఈ కె.విజయలక్ష్మి, హెచ్‌ఎస్‌లు జోగిరాజు, వీరగనిక, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశ వర్కర్లు, పాఠశాల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

పెదపూడి: కైకవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఐసీడీఎస్ అధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ బాలికల చట్టాలు, హక్కులపై వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీగౌరీ, ప్రధానోపాధ్యాయుడు వాసంశెట్టి శ్రీనివాసు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్య సదస్సు

రాజానగరం: ఆడపిల్లలను ప్రోత్సహిస్తే దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహించే శక్తులుగా ఎదుగుతారని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కవిత అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైతన్య సదస్సు నిర్వహించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆత్మ రక్షణా చర్యలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ షేక్ మీరా, హెచ్‌ఎం పి.నాగమణి, పీఈటీ సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికలను చదివిద్దాం

సీతానగరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో 'బాలికలను చదివిద్దాం.. రక్షిద్దాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పెద్దలక్ష్మి హాజరై..విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కోరుకొండలో ర్యాలీ

మధురపూడి: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కోరుకొండలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ పీఓ ఝాన్సీరాణి మాట్లాడుతూ బాలికలకు విద్య ఒక రక్షణ ఆయుధమన్నారు. దాని ద్వారా భారత రాజ్యాంగం నుంచి సంక్రమించిన హక్కులను పొందడానికి వీలుంటుందన్నారు. బాలికలు చదువులో రాణించి ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. తద్వారా లింగ వివక్ష, బాల్యవివాహాలను రూపుమాపే అవకాశం ఉంటుందన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం ఎం.మణి కుమార్ మాట్లాడుతూ బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

నేతాజీకి ఘన నివాళి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంత్యుత్సవం, జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సుభాష్ చంద్రబోస్ అలుపెరగని పోరాటం చేశారన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే, వారు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎం.సుధామయి, ఆంగ్లోపన్యాసకులు వీవీ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

పెదపూడి: అనపర్తి ఎర్ర కాలువలో దేవీ సెంటర్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని అనపర్తి అదనపు ఎస్సై బి.దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధవళేశ్వరం వైపు నుంచి అనపర్తి కాలువలోకి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. అతని వయసు 40 ఏళ్లు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడని ఎస్సై అన్నారు. స్థానిక వ్యాపారి కె.వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

నేడు హోమియో వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో శనివారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వంగలపూడి మసీదు గురువు మహ్మద్ అక్బర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడిలో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లీమ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. లండన్‌లో వైద్యం చేసిన అనుభవం కలిగిన డాక్టర్లు అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యసేవలు అందిస్తారన్నారు.

అన్నసమారాధన


వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న ఫెస్పా సభ్యులు

రాజానగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కొండగుంటూరు వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఉచిత విద్య విద్యార్థులు తల్లిదండ్రుల సంఘం (ఫెస్పా)ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

త్వరితగతిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు

రాజమహేంద్రవరం సిటీ: వెంకట్రామయ్యనగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని సత్వరమే పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. అలాగే ద్రవ వ్యర్థ పదార్థాల సీవేజీ ప్లాంట్ నిర్వహణ విషయంలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ఆమె శుక్రవారం ఇండోర్ స్టేడియం, హుకుంపేట ఎస్‌టీపీ పనులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అమృత్ పథకంలో హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న 50.60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.3 కోట్లతో వెంకటరామయ్య నగర్‌లో ప్రస్తుతమున్న షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలో మైదానం, రెండు అంతస్తులుగా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిలో చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, జిమ్ ఎక్విప్ మెంట్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే 82 శాతం పనులు పూర్తయ్యాయని, అతి త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. హుకుంపేటలో ప్రస్తుతం ఉన్న 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పని తీరును, లేబొరేటరీలో ట్రీట్ చేస్తున్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతమున్న 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు జనాభా అవసరాలకు సరిపోవటం లేదన్నారు. దీంతో అమృత్, జాతీయ నదీ పరివాహక పరిరక్షణ పథకంలో అదనంగా రూ.88.43 కోట్లతో ఎస్‌టీపీ నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు 50 శాతం పూర్తయ్యాయని, త్వరితగతిన మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్, జి.పాండురంగారావుపాల్గొన్నారు.

పశు బీమా సద్వినియోగం చేసుకోవాలి


ఊలపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాట్రగడ్డ రాధాకృష్ణమూర్తి


ఇనుగంటివారిపేటలో పశువుల మందులు అందిస్తున్న సర్పంచ్ రాంపండు

బిక్కవోలు: పశు బీమాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అమరావతి డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి పరిశీలకుడు కాట్రగడ్డ రాధాకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన ఊలపల్లిలోని ఉచిత పశు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పశువుల్లో ప్రస్తుతం 62,500 పశువులకు బీమా చెల్లించడానికి రూ.2.5 కోట్లు విడుదలైందని తెలిపారు. ప్రతి పశువులకు రూ.30 వేల బీమా ఉంటుందన్నారు. పొరపాటున పశువు మృతి చెందితే పాడి రైతులకు రూ.30 వేలు బీమా కంపెనీ ఇస్తుందన్నారు. దీనికి మూడేళ్ల కాల పరిమితి ఉంటుందన్నారు. ఒక పశువుకు రూ.2 వేలు చెల్లించాలని, అయితే పాడి రైతు 400 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మిగిలిన రూ. 1,600 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సుమారు 110 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం పశువైద్య సలహాలపై పోస్టర్ ఆవిష్కరించారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మక్కెన వెంకటేశ్వరరావు, అనపర్తి ఏడీ డాక్టర్ వై.శ్రీనివాసరావు, మండల పశు వైద్యులు ప్రణీత్, రవికుమార్, వీర్రాజు, జేవీఓ సూర్యకుమారి, పీహెచ్‌సీ మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు, జీవాలకు వైద్య సేవలు

సీతానగరం: ఇనుగంటివారిపేటలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో 64 పశువులకు, 200 మేకలు, గొర్రెలకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర వైద్యసేవలు అందించారు. సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ-2 సత్య మదన్‌బాబు, కూటమి నాయకుల చేతుల మీదుగా పాడి రైతులకు పశువుల మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ కాటవరంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహిస్తామని, కాటవరం, జాలిమూడి పాడి రైతులు తమ పశువులకు వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏ అదిలక్ష్మి, ఏహెచ్‌ఏలు అశోక్ చక్రవర్తి, చిలకమ్మ, సౌశీల్య, వెంకటేష్, అల్లు శ్రీనివాస్, అంగర సాయి, గోపాలమిత్ర పసన రమణ పాల్గొన్నారు.

నేడు ఆనం కళాకేంద్రంలో 'లోకల్ సెలబ్రిటీ షో'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ భద్రమ్స్ ఫిల్మ్ హౌస్ ఆధ్వర్యాన వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు లోకల్ సెలబ్రిటీ షో నిర్వహిస్తున్నట్లు హాస్య నటుడు డాక్టర్ భద్రం తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఇలాంటి షోలు నిర్వహిస్తామన్నారు. తొలిసారిగా కళాసాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నటులు, గాయకులు ఈషోకి వచ్చి ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు. సాధారణంగా సినిమాల్లో నటించాలంటే హైదరాబాద్ వెళ్లి, రూమ్ అద్దెకు తీసుకుని అన్ని ఆఫీసుల చుట్టూ తిరగాలన్నారు. అయినా సరే అవకాశం ఎప్పుడు వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంటుందన్నారు.